# మొగలిరేకు

## యామిని

(గత సంచిక తరువాయి)

"నాకు వాయించాలని లేదు," అంది రాధ.

"పావుగంటేనా కాలేదు ... మీ అమ్మగారు చూస్తే..."

"మా అమ్మ ఇంట్లో లేదు."

"అయ్యో బాబోయ్! అయితే నేను వెళ్ళొస్తాను."

"మీరు పాఠం చెప్పకుండా వెళ్ళిపోయేరని అమ్మతో చెప్తాను."

"వద్దు తల్లీ నీకు పుణ్యం ఉంటుంది."

"పనసతొనలాంటి పిల్లను పట్టుకొని తల్లీ అంటారేమిటి! మీవన్నీ పసివాళ్ళ బుద్ధులు!"

"నేను నీతో మాట్లాడలేను."

"మేస్టారూ!"

"ఊఁ!"

"మీకు ప్రపంచంలో అన్నింటికంటె అందమైనదేమిటి?"

"ఏమో తెలీదు."

"ఆలోచించండి!"

"నా చేతకాదు."

"నా కందమైనదేమిటో చెప్పమంటారా?"

"అక్కర్లేదు..."

రాధ మూతి ముడిచింది

"చెప్పు తల్లీ! చెప్పు!" అన్నాడు కృష్ణమూర్తి.

"చెప్పెయ్యమంటారా!"

"మీరు నమ్ముతారు కదూ!"

"ఆఁ."

"చెప్పేక నమ్మనని నన్ను చిన్నబుచ్చుతారేమో!"

"ఏమీ చిన్నబుచ్చను."

"అయితే చెప్పేస్తున్నా..."

"చెప్పు"

"మా చిన్నారి పిలకమేస్టారూ! ఎంత ముద్దుగా ఉంటుందని నా కెప్పుడూ

దాన్ని దువ్వి దిద్దాలని ఉంటుంది... మేష్టారూ మేష్టారూ..."

"ఏమిటి?"

"ఒక్కసారి మీ పలక దువ్వ నియ్యరూ!" అని కృష్ణమూర్తి పలక పట్టుకోబోతుంటే "ఏమిటే అది?" అంటూ మాణిక్యం వచ్చింది.

"చూడండి మీ అమ్మాయి నన్ను పలకపట్టుకొని ఆడిస్తూంది." అన్నాడు కృష్ణమూర్తి

"నాకీ ఫిడేలు తలనొప్పిగా ఉందమ్మా! రేపట్నుంచి మాస్టార్ని రావద్దని చెప్పమ్మా!" మారాంతో సాగ తీస్తూ అంది రాధ కృష్ణమూర్తికి సైగ నిసి.

"ఏమిటే ఆ కొంటె పనులు! పెద్దవాళ్ళని అలా వేళాకోళం చెయ్యొచ్చా! నాకు కోపం రప్పించక బుద్ధిగా నేర్చుకో! దాని మాటలు లెక్కచెయ్యకండి మేస్టారూ! మీ పని మీరు కానివ్వండి" అని వెళ్ళిపోయింది మాణిక్యం.

కృష్ణమూర్తిని గట్టిగా పట్టుకొని అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది రాధ.

ఆనాటి నుండి రాధ కొంటెతనం వెనుక ఉన్న ఆప్యాయత ఆరాధన గుర్తించిన కృష్ణమూర్తికి ఆమె వద్ద ఒక మనిషిగా ఒక కళాకారుడిగా సానుభూతి లభించింది లౌక్యం తెలియని వాడుగా పేదవాడుగా సంఘం అతన్ని చూసిన



చిన్నచూపుకు మారుగా అతనొక గొప్ప వ్యక్తిగా ఆమెచూపిన గౌరవం ఒక సంగీతవేత్తగా అతనిని భావపార వశ్యంతో కొలవడం ఆమెపట్ల ఎంతో స్నేహభావాన్ని రేకెత్తించాయి. పైగా వేశ్యగా స్త్రీపురుష సంబంధాలలో ఒక నియమానికి అలవాటుపడని ఆమె స్వేచ్ఛా ప్రవృత్తి అతన్ని ఆమెకు మరింత తొందరగా చేరువచేసింది.

రాధకు మాత్రం తాను అందరిలోకీ మిన్నయైన ఆటకత్తెగా అందకత్తెగా పేరు పొందడంతోనే అన్నాళ్ళూ గర్వంతోకూడిన సంతృప్తి కలిగినా కృష్ణమూర్తితో పరిచయం అయిన తర్వాత ఆమెకు తెలీకుండానే క్రమక్రమంగా తన వృత్తిమీద నీచభావం కలగడం మొదలుపెట్టింది. తనకోసం అతడు, అతనికోసం తాను అనేభావం బలపడిసాగింది. ఒకరికొకరు వ్యసనంగా మారుతూన్న ఆ పరిస్థితి గమనించే మొదటికి మోసంవస్తుందని సుందరి రాధను వారించింది అందుచేత లోలోపల ఎంతమార్పు వస్తూన్నా బాహ్యంగా ఏమీ మార్పులేనట్లుగానే అతిప్రయత్నం మీద నడుపుకొస్తూంది రాధ.

## 2

రామమోహనరావుగారూ, కేశవరావుగారూ ఒకవూరి వాళ్ళే. అగర్భ శ్రీమంతుడుగా కేశవరావు పుడితే పేదవాడుగా పుట్టి పొరుగూరి శ్రీమంతుల ఇంటికి




దత్తుడుగా వాళ్ళ ఆస్తికి వారసుడుగా వెళ్ళేడు రామమోహనరావు. ఇరువురి పొలాలనూ కనుచూపుమేరకు కలిపి ఉంచిన సరిహద్దు గట్టులాగే వాళ్ళిద్దరి మధ్యా స్నేహం చలనంలేకుండా అలానే ఉంది. మనస్తత్వాలు వేరయినా పరస్పరం మర్యాద చూపించుకోడానికి సరితూగడానికి సరిపోయే సంపద ఉండడంచేత వ్యత్యాసాలు ఎప్పుడూ కొలవబడలేదు.

నిజానికి కేశవరావు స్వభావం కొంత అభిజాత్యం, విలాసత్వం కూడుకొని ఉండగా రామమోహనరావు మాత్రం చాలా క్రమశిక్షణ కలిగి సాంప్రదాయాన్ని గౌరవించే మనిషి. రుక్మిణీదేవి పుట్టినప్పటినుంచీ అంతకు ముందే కొడుకును కన్న కేశవరావు ఆమెను 'కోడలా!' అంటూండడం అలాగే కేశవరావు కొడుకు హరినారాయణను రామమోహనరావు 'అల్లుడా!' అనడం రెండు కుటుంబాల్లోనూ బాగా అలవాటయిపోయింది.

రామమోహనరావుగారి అత్తగారి కుటుంబం బ్రతికి చెడ్డదయింది. ఆయన అత్తగారు కళ్ళుమూస్తూ పసివాడైన ఒక్కగానొక్క కొడుకు నరసింహాన్ని కూతురు చేతిలో పెట్టిపోయింది. తల్లి లేని పిల్లవాడని కొంచెం మెత్తగా ఉండడం వలననో సహజ స్వభావం వలననో నరసింహానికి ఏమంచివిద్యా అలవడలేదు. అందుచేత ఇంటి పనులే చేస్తూండిపోయాడు. తగిన మంచి స్నేహం దొరకకా, రోజుకు ఇరవై నాలుగుగంటలూ ఏమి చెయ్యాలో తెలియకా అక్క బావల కనుమరుగులో అన్ని వ్యసనాలూ నేర్చుకున్నాడు. ఆ నోటా ఈనోటా వాటిని గురించి తెలిసిన అక్క మందలించింది. బావగారు అసహ్యించుకున్నాడు.

ఎవరో ఎప్పుడో అన్న మాట మనసులో నిలచిపోయి మేనకోడలు రుక్మిణీదేవి పెద్దదవుతూంటే ఆమెను పెళ్ళి చేసుకోవాలని కలలు కనడం మొదలుపెట్టేడు.

చివరకు కేశవరావుగారి అబ్బాయి హరినారాయణతో రుక్మిణికి తాంబూలాలు పుచ్చుకోబోతున్నారని తెలిసి తెగించి ఒక రోజు అక్కముందు మనసులోకోరిక బయటికి వెలిబుచ్చేడు.

లక్ష్మీదేవికి తమ్ముడిమీద ఎంత అభిమానమున్నా రుక్మిణికి తగిన వరుడు కాదనిపించింది. పైగా వయసులోకూడా పది సంవత్సరాలు మించి తేడాఉంది. అన్నిటికీమించి భర్త సుతరామూ ఒప్పుకోడన్నవిషయం స్పష్టంగా తెలుసు.

"రుక్మిణి పుట్టినప్పటినుంచి స్నేహితులిద్దరూ వియ్యంకుళ్ళు కావాలనీ కలలు కంటున్నారు తమ్ముడూ! ఇప్పుడు ఆయన కేశవరావుగారిని కాదనలేరు." అంటి తమ్ముణ్ణి చిన్నబుచ్చడంఇష్టంలేక.

ఆనాటి నుండి రుక్మిణి పెళ్ళయిన తర్వాత తన గతి ఏమవుతుందోనని పెద్దభయం పట్టుకుంది నరసింహానికి. ఆ రోజునుండి కావాలని పసగట్టి చేతికి దొరికిందల్లా పక్కకు పెట్టి జాగ్రత్త పడుతున్నాడు.

రుక్మిణికి తాంబూలాలు పుచ్చుకొన్నప్పుడు నరసింహం ఉత్సాహంగా అన్ని పనులూ చేస్తూంటే తమ్ముడి మనసు గాయపడలేదని కొంత కుదుటబడింది లక్ష్మీదేవిమనసు. ఆ జాలితో ఇంటి విషయాల్లో మరింత చనువిచ్చింది. నరసింహం పాచికపారింది.

ఒక్కగానొక్క కూతురైన రుక్మిణి పెళ్ళి ఎంతో వైభవంగా ముచ్చటగా జరిపించాలని నిశ్చయించుకున్నాడు రామమోహనరావు.

నెలరోజుల ముందునుంచే పెళ్ళపనులు ప్రారంభమయ్యేయి. పెళ్ళి అయిదురోజులకూ రోజుకు ఇరవై నాలుగు గంటలూ వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి.

ఊరంతాపందిరి వేశారు విడిదిదగ్గర ఒకటి పెళ్ళింటి దగ్గరఒకటి ఉన్న వాళ్ళల్లో పోటీపడి పేరు తెచ్చుకున్న రెండు బ్యాండు మేళాలు కుదిర్చేరు. మేజువాణీలు కుదిర్చేరు. ఎప్పుడు ఎవరు ఏమికావాలన్నా అందుబాటులో ఉండేటట్లు తినుబండారాలూ, టిఫిన్లు, కాఫీలనూ ఏర్పాట్లు చేసేరు.

మగ పెళ్ళివారు ఊళ్ళోకి వచ్చారు. బ్యాండు మేళాలు రెండూకలసి దిక్కులు ప్రతిధ్వనించేటట్లుగా పెళ్ళి వారికి స్వాగతం పలికేయి.

పూర్వం రాజుల కాలంలో లాగా నెరజాణలు నాట్యంచేస్తూ ఎదురు సన్నాహం వెళ్ళేరు

కేశవరావుగారు వియ్యంకుడు చేస్తూన్న మర్యాదకి పరమానంద భరితుడైపోయాడు.

తెల్లవారితే పెళ్ళి.

ఉరుమూ మెరుపూ లేకుండా నీలాకాశంలో నుంచి పిడుగుపడింది.

రామమోహనరావుకు మద్రాసు నుండి టెలిగ్రాం వచ్చింది. ఏనాడో అతని దాయాదులు అతని దత్తత చెల్లదనీ, అతన్ని పెంచుకున్న వారి ఆస్తి దక్కదనీ వేసిన దావాలో రామమోహనరావుకు ప్రతికూలంగా హైకోర్టు తీర్పుయిచ్చింది. ఆనాటినుండి అతడు ఏ ఖర్చూ ఆ ఆస్తినుండి చేయడానికి వీలుండదనీ జరిగిన ఖర్చుకు లెక్క చెప్పవలసి ఉంటుందనీ కూడా ఉంది.

వచ్చిన మరుక్షణమే వార్త మగ పెళ్ళివారి విడిదిలోకి పాకిపోయింది.

## 3

ఉరుములు మెరుపులతో కుంభవృష్టిగా కురుస్తూన్న వాన అలాగే హఠాత్తుగా నిలిచిపోయినంత నిశ్శబ్దంగా ఉంది. పొంగుతూన్న సముద్రంలోని అణు

వణువులోనూ చలనం స్తంభించిపోయి నట్టుంది.

గాలికూడా వీచడంమానివేసినట్లుంది.

ఊరందరి మనస్సుల్లోనూ ఒకటే ప్రశ్న ! కేశవరావుగారు పెళ్ళి ఆపుచేసి వెనక్కి వెళ్ళిపోతున్నారు ! ఎలాగ ! ఏం జరుగుతుంది !

పెళ్ళింట్లోంచి చెప్పులుకూడా లేకుండా విడిది ఇంట్లోకి రామమోహనరావు నడచి వెడుతూంటే అందరికన్నులూ ఉరికంబాని కెక్కుతూన్న దోషిని చూసినట్లు ఆయన మీదే ! చెదిరిన భావాలతో చేష్టలుదక్కి నిర్జీవంగా తండ్రి వెళ్ళినవైపే చూస్తుంది రుక్మిణి. ఆగని కన్నీళ్ళ ప్రవాహాన్ని తుడుచుకుంటూ దిక్కుతెలియక రోది స్తూంది లక్ష్మీదేవి

పందిరి, పచ్చతోరణాలూ, పలుకని వాయిద్యాలూ అన్నింటికీ అసందిగ్ధం దుంబ్రంగానే ఉంది.

రామమోహనరావు కేశవరావు కూర్చున్న గదిలోకి వెళ్లేరు. అందరికీ విషయం ఒకేవిధంగా అర్థంఅయినట్లుగా వాళ్ళిద్దర్నీ అక్కడ వదలి అందరూ బయటకు వచ్చేసేరు. ఎవరో తలుపు దగ్గరగా మూసేరు.

రామమోహనరావు కేశవరావు కళ్ళ ల్లోకి చూసేడు.

తన నిస్సహాయతని చెప్తూన్నట్లుగా కేశవరావు తల పక్కకుతిప్పుకున్నాడు.

మరో రెండు నిముషాలు దారుణమైన నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దమే కొన్ని ప్రశ్నలు వేసుకుని జవాబు చెప్పుకున్నట్లుంది

"నేను సుప్రీంకోర్టుకు అప్పీలు చేయవచ్చు !" అన్నాడు రామమోహన రావు.

"తీర్పులో మార్పుండకపోవచ్చు !" అన్నాడు కేశవరావు.

"నా ఆస్తి మూసే నువ్వు వియ్యమందా లనుకున్నావా ?"

"నా కొడుకు ఈరోజు బిచ్చగాడుగా రోడ్డుమీద నిలబడి ఉంటే ఇంత వైభవం తోనూ, సంతోషంతోనూ నువ్వు ఈ పెళ్ళి చెయ్యగలవా ?" ఎదురు ప్రశ్న వేసేడు కేశవరావు.

"ఈ పెళ్ళి ఆగిపోతే నా ఇంటి పరువూ, రుక్మిణి జీవితం ఏమవుతాయో ఆలోచించగలవా !"

"ఆ రెండింటికీ నేను చాలా విచారి స్తున్నాను."

"కాని నువ్వు కనీసం దాని జీవితా న్నయినా రక్షించగలవు."

"మావాడి భవిష్యత్తు !"

"అతడెలాగూ నీ కొడుకే ! అతని కేంలోటు !"

(సశేషం)

Pirnted and Published by A. Chandra Sekhar Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor: A. SUDHAKARA RAO